



ఎయిర్‌పోర్టులో రాత్రిపూట జరుగుతున్న రన్‌వే రీ సర్ఫేసింగ్ పనులు

పోలీసులు ఓవరాక్షన్



రాత్రిపూట తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రాత్రివేళ తనిఖీల సమయంలో వాహన చోదకుల పట్ల కొంతమంది దురుసు ప్రవర్తన

- వాహనం ఆగకముందే తాళాలు లాగేస్తున్న కానిస్టేబుళ్లు
- ప్రమాదాలకు ఆస్కారం
- అదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలింపు
- తెల్లవారుజాము వరకూ ఉంచి విడిచిపెడుతున్న వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా రాత్రివేళ పోలీసులు నగరంలో ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అడగడం, ఎక్కడి నుంచి వస్తున్నారు?, ఎక్కడకు వెళుతున్నారని ఆరా తీయడం సహజం. వాహనం వివరాలతో పాటు వాహన చోదకుడి సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేసుకుంటారు. అంతవరకూ అభ్యంతరం లేదు. అయితే కొంతమంది పోలీసులు ఇదే సమయంలో వాహనచోదకుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

నగరంలో రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకూ అన్ని ముఖ్య కూడళ్లలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాన్ని పక్కకు తీసి ఆపాలంటూ పోలీసులు సైగ చేస్తున్నారు. వాహన చోదకులు వాహనాన్ని రోడ్డుపక్కన ఆపుతున్న సమయంలో అక్కడే ఉన్న సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించి ఎక్కడ ఆపకుండా వెళ్లిపోతారోనని తాళం తీసేస్తున్నారు. ఈ క్రమంలో వాహన చోదకులు ... మిగతా 6వ పేజీలో

విశాఖ టీడీపీ అధ్యక్షుడిగా బాబ్జీ



గండి బాబ్జీ

- మూడేళ్ల క్రితం 'సౌత్' ఇన్‌చార్జిగా నియామకం
- పొత్తులో భాగంగా జనసేనకు 'దక్షిణం'
- ఈ క్రమంలోనే పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా అవకాశం
- అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్న బాబ్జీ

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ నియమితులయ్యారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం పార్టీ అధ్యక్షునిగా ఉన్న పల్లా శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. పల్లా శ్రీనివాసరావు సుమారు నాలుగేళ్లు అధ్యక్ష పదవిలో కొనసాగారు.

గండి బాబ్జీ మూడేళ్లుగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే, పొత్తులో భాగంగా సౌత్ సీటు జనసేనకు దక్కింది. ఈ నేపథ్యంలో బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని భావించిన పార్టీ అధినేత చంద్రబాబునాయుడు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన గండి బాబ్జీ బీఎల్ పట్టభద్రులు. తొలుత కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని ... మిగతా 6వ పేజీలో

ఎయిర్‌పోర్టు రన్‌వే రెడీ

ఏప్రిల్ 1 నుంచి 24/7 సేవలు

నిర్దేశిత సమయంలో రీ సర్ఫేసింగ్ పనులు పూర్తి



ఎయిర్‌పోర్టులో జరుగుతున్న రన్‌వే పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విమానాశ్రయంలో రన్ వే 'రీ సర్ఫేసింగ్' పనులు తుది దశకు వచ్చాయి. ఈ నెల 31తో వీటిని పూర్తిచేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి యథా ప్రకారం 24/7 విమానాల రాకపోకలు ప్రారంభించడానికి ఐఎన్ఎస్ డేగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నవంబరు 15న రీ సర్ఫేసింగ్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగు నెలలు రాత్రి, పగలు తేడా లేకుండా పాత రన్ వేకు మరమ్మతులు చేసి, దశల వారీగా నాలుగు కొత్త పొరలు వేశారు. ఈ సమయంలో పౌర విమానాల రాకపోకలపై నేవీ అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో విమానాశ్రయం శీతాకాలపు షెడ్యూల్ పూర్తిగా మారిపోయింది. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల మధ్యే విమానాల రాకపోకలకు అనుమతించారు. ఉదయం 8 గంటలకు ముందు, రాత్రి 9 గంటల తరువాత సర్వీసులు పూర్తిగా రద్దు చేశారు. విశాఖ నుంచి సింగపూర్‌కు నడుస్తున్న ఒకే ఒక విమానాన్ని రీ షెడ్యూల్ చేశారు. ఇప్పుడు రన్ వేను పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తే ఏప్రిల్ నుంచి వేసవికాలపు షెడ్యూల్ మొదలవుతుంది. కొత్త సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. మలేషియా, దుబాయ్ అంతర్జాతీయ విమానాలు కూడా సమయాలు మార్చుకొని నడుస్తాయి.

కరోనా వల్ల పనులు ఆలస్యం

విశాఖపట్నం విమానాశ్రయంలో విమానాల సంఖ్య బాగా పెరిగింది. దానికి తగినట్టుగా రన్ వేను పది వేల అడుగులకు విస్తరించారు. దీనిని 2007 జూన్ 15న ప్రారంభించారు. ప్రతి పదేళ్లకు ఓసారి రన్ వేకు రీ సర్ఫేసింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఇది రక్షణ శాఖకు చెందిన నేవీ విమానాశ్రయం కావడం, పటిష్ఠంగా నిర్మించినది కావడంతో 15 ఏళ్ల తరువాత ఆ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ప్రారంభించాలనుకునే సమయానికి కరోనా రావడంతో పనులు చేపట్టలేకపోయారు. ఆ తరువాత నేవీ అవసరాలు పెరగడం, పౌర విమానాల సంఖ్య బాగా పెరగడంతో తప్పనిసరిగా రీ సర్ఫేసింగ్ పనులు చేపట్టాల్సి వచ్చింది. దీనికి నేవీ అధికారులు గత ఏడాది నవంబరు 15న శ్రీకారం చుట్టారు. కేవలం నాలుగు నెలల్లో పూర్తి ... మిగతా 6వ పేజీలో

రన్‌వే రీసర్ఫేసింగ్ అంటే...

విమానాలు రన్‌వే మీదనే దిగి, అక్కడి నుంచే టేకాఫ్ తీసుకుంటాయి. రాకపోకలు సాఫీగా సాగాలంటే రన్‌వే క్లియర్‌గా ఉండాలి. పదేళ్లకు ఓసారి మరమ్మతులు చేస్తారు. పై పొరను కొత్తగా వేస్తారు. ఇందులో భాగంగా పై పొరను పూర్తిగా తొలగించి, అవసరమైన చోటల్లా మరమ్మతులు చేసి, మళ్లీ పై పొరను వేస్తారు. ఆ తరువాత దానిపై మార్కింగ్, లైటింగ్ వంటి పనులు చేపడతారు. ఈ ప్రక్రియనే 'రీ సర్ఫేసింగ్' అంటారు.

అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి 'బూడి'



- ఉప ముఖ్యమంత్రిని సమన్వయకర్తగా నియమించిన అధిష్ఠానం
- మాడుగుల ఇన్‌చార్జిగా ముత్యాలనాయుడు కుమార్తె అనురాధ

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్త పేరును వైసీపీ అధిష్ఠానం ఎట్టకేలకు మంగళవారం ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేరును ఖరారు చేసింది. దీంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా ముత్యాలనాయుడు పోటీ చేయడం దాదాపు ఖరారైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆయన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ పేరును ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో మాడుగుల నుంచి ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని తెలిసింది.

రాష్ట్రంలో 25 లోక్‌సభ నియోజకవర్గాలకుగాను అనకాపల్లి మినహా మిగిలిన అన్ని స్థానాలకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల పేర్లను ఈ నెల 16వ తేదీన పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. జాబితాలో అనకాపల్లి లోక్‌సభ స్థానానికి అభ్యర్థి పేరు వద్ద ఖాళీ ఉంచి, 'కేటగిరి' కాలమ్‌లో 'బీసీ' అని మాత్రమే పేర్కొన్నారు. కాగా అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి కూటమి తరపున తొలుత జనసేన పోటీ చేయాలని భావించింది. కానీ బీజేపీతో టీడీపీ-జనసేన పార్టీలకు పొత్తు కుదిరిన తరువాత ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. దాంతో బీజేపీ అభ్యర్థిని బట్టి తమ పార్టీ అభ్యర్థిని ఎంపిక చేయాలని వైసీపీ పెద్దలు భావించారు. బీజేపీ తరపున రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేస్తారని వెల్లడి కావడంతో వైసీపీ అధిష్ఠానం ఉపముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేరును మంగళవారం ప్రకటించింది. మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్తగా ఆయన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధను నియమించారు.

డీసీఐలో వివాదం

ఎండీ, సీఈఓ నియామకానికి బ్రేకులు

కోర్టును ఆశ్రయించిన మాజీ ఎండీ విక్టర్

- ప్రక్రియను మాత్రం కొనసాగించవచ్చు
- నేడు హైకోర్టులో కేసు విచారణ

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)లో మేనేజింగ్ డైరెక్టర్ కమ్ సీఈఓ నియామకం ప్రక్రియ తాత్కాలికంగా ఆగిపోయింది. గత ఏడాది 2023 నవంబరు 7వ తేదీన ఈ పోస్టుకు అనుభవం కలిగిన వ్యక్తులు కావాలని సంస్థ ప్రకటన జారీచేసింది. గతంలో ఎండీ, సీఈఓగా పనిచేసిన జార్జి విక్టర్ దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో నియామకపు ప్రక్రియ కొనసాగించవచ్చునని, తీర్పు వెలువడేంత వరకు ఎవరినీ నియమించవద్దని ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ కేసు ఈ నెల 27వ తేదీన (బుధవారం) హైకోర్టులో విచారణకు వస్తోంది. అక్కడ వెలువడే నిర్ణయం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని సమాచారం.



ఇదీ జరిగింది

జార్జి విక్టర్ సరైన విద్యార్హతలు లేకుండా అడ్డదారిలో డీసీఐలో చేరారు. దీనికి కొందరు అధికారులు సహకరించారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతున్నదని భావించిన పలువురు సంస్థలో విషయాలు బయటకు తీసుకువచ్చారు. ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆ సమయంలో 'డీసీఐలో శంకర్ దాదా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో డీసీఐకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విశాఖపట్నం పోర్టు చైర్మన్ విచారణకు ఆదేశించారు. జార్జి విక్టర్ ఆర్థిక వ్యవహారాల్లో కూడా పక్షపాతంగా వ్యవహరించారని, దాని వల్ల సంస్థకు భారీగా నష్టం జరిగిందని గుర్తించారు. దాంతో 2022 జూలైలో ఆయన్ను సస్పెండ్ చేశారు. మరికొందరు అధికారులకు సంజాయిషీ కోరుతూ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో విక్టర్‌పై ఆరోపణలన్నీ నిజమేనని రుజువు కావడంతో గత ఏడాది (2023) మార్చి 31న పోర్టు చైర్మన్‌గా రామమోహన్‌రావు పదవీ విరమణ చేస్తున్న సమయంలో జార్జి విక్టర్‌ను పూర్తిగా తొలగిస్తూ ఆదేశాలు జారీచేశారు. మిగిలిన వారిపై తరువాత వచ్చే అధికారులు చర్యలు చేపడతారని ప్రకటించారు. జార్జి విక్టర్‌ని తప్పించిన తరువాత సీనియర్ చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ దివాకర్‌కు అడిషనల్ చార్జి ఇచ్చి ఎండీ, సీఈఓగా నియమించారు. ఆయనే ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే డిస్మిస్‌కు గురైన జార్జి విక్టర్ కోర్టులో కేసు వేశారు. తనను అన్యాయంగా తొలగించారని, తిరిగి నియమించాలని ఆదేశించాలని కోరారు. ఈ కేసు కోర్టులో ఉండగానే గత ఏడాది నవంబరులో కొత్త ఎండీ, సీఈఓ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ విషయాన్ని జార్జి విక్టర్ కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తన కేసు పరిష్కారం కాకుండానే కొత్త వారిని నియమిస్తున్నారని మరో పిటిషన్ వేయడంతో కోర్టు నియామకం చేయవద్దని, ప్రక్రియ మాత్రం కొనసాగించుకోవచ్చునని సూచించింది. ఈ కేసు బుధవారం విచారణ వస్తోంది.

కెప్టెన్ దివాకర్‌కు పొడిగింపు

డీసీఐ ఎండీ, సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న దివాకర్ నియామకపు గడువు ఈ నెల 31తో ముగుస్తుంది. ఆయన కూడా నవంబరులో వచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అదే పోస్టులో ఉంటే ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుందని, తాత్కాలికంగా ఆ బాధ్యతలను పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబెకి అప్పగించాలని బోర్డు సమావేశంలో ఇటీవల నిర్ణయించారు. అయితే ఆయన వ్యక్తిగత కారణాల వల్ల సెలవులో ఉన్నారు. ఈ నేపథ్యంలో దివాకర్‌కు ఎండీ, సీఈఓగా కొనసాగడానికి మరో నెల సమయం ఇచ్చారు. ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ తేదీలోగా డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె వచ్చి బాధ్యతలు తీసుకుంటే ఇచ్చేయాల్సి ఉంటుందని సూచించారు.

నేటి నుంచి సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

- పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం పది గంటల నుంచి ప్రారంభం



విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: విశాఖ క్రికెట్ క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు బుధవారం ఉదయం పది గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభం కానున్నాయి. ఈ మ్యాచ్ 31వ తేదీన స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నది. టికెట్ల ధరలు రూ.1,000, రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ వన్డే, టీ-20 మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌లో కాకుంటే ఆఫ్‌లైన్ ద్వారానైనా టికెట్ పొందేందుకు అవకాశం ఉండేది. కానీ, ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకాలు కేవలం ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈనెల 31వ తేదీన జరిగే మ్యాచ్‌లో ధోనీ ఆడనుండడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ధోనీ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పడం, రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశాలు తక్కువగా ఉండడం, దాదాపు ఐదేళ్ల తర్వాత విశాఖలో ఆడనుండడం, పైగా చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్‌లో బలమైన జట్టు కావడం వంటి అనేక కారణాలు మ్యాచ్‌పై క్రేజ్‌ను పెంచాయి. అయితే అమ్మకానికి ఎన్ని టికెట్లు అందుబాటులో పెడుతున్నారనే లెక్కలను నిర్వాహకులు వెల్లడించలేదు. స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా అందులో ఎన్ని టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మబోతున్నారనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. ఈ మ్యాచ్ టికెట్లను ఇప్పటికే బ్లాక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు రాక రేపు

ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్‌లో తలపడనున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు గురువారం నగరానికి రానుందని తెలిసింది. మంగళవారం చెన్నైలో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ఆడిన చెన్నై సూపర్‌కింగ్స్, బుధవారం అక్కడే విశ్రాంతి తీసుకుని గురువారం మధ్యాహ్నానికి విశాఖ చేరుకుంటుంది. విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు చేరుకుంటుంది. గురువారం సాయంత్రం, శుక్రవారం నెట్ ప్రాక్టీసు చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ ఈనెల 28న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ ఆడి, మర్నాడు ఉదయం అక్కడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.13
సహరి (గురు)	4.39

వాల్తేరు రైల్వే రికార్డు



- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల మార్కు దాటిన ఆదాయం
- డివిజన్ చరిత్రలో మైలురాయి: డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా ఆర్థిక సంవత్సరం ఇంకా పూర్తికాక ముందే రూ.10 వేల కోట్ల ఆదాయం సాధించింది. ఇది గత ఏడాది కంటే పది శాతం అధికమని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం వెల్లడించారు.

గత ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చి 25వ తేదీ నాటికి రూ.9,113 కోట్ల ఆదాయం నమోదుచేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ముగియడానికి ఇంకా ఐదు రోజుల వ్యవధి ఉండగానే రూ.10 వేల కోట్లు దాటింది. డివిజన్‌చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. వినియోగదారులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి వ్యూహాలు రూపొందించడం, వారితో కలిసి పనిచేయడం, ప్రయాణికులకు వసతులు పెంచడం, క్రూ మేనేజ్‌మెంట్ పనితీరు బాగుండడం తదితర కారణాల వల్ల ఈ ఆదాయం సాధించగలిగామని డీఆర్ఎం వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, రైల్వే లైన్ల డబ్లింగ్ పనులు, భద్రతకు సంబంధించిన పనుల వల్ల సాధారణ రాకపోకలకు కొంత అంతరాయం కలిగినా ఈ వృద్ధిని సాధించడం విశేషమని ఆయన అధికారులు, సిబ్బందిని అభినందించారు.

నెరవేరని మరో హామీ



- 'కీళ్ల మార్పిడి' శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీలో చేరుస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటన
- ఏళ్లు గడుస్తున్నా అమలు చేయని ప్రభుత్వం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షన్నర నుంచి రూ.3 లక్షల వరకు వసూలు
- అంత స్థోమత లేక మంచాలకే పరిమితమవుతున్న నిరుపేదలు

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వయోభారం, అధిక బరువు, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా కీళ్లు అరిగిపోయి నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో 60 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఈ సమస్య కనిపించేది. ఇప్పుడు ఒబెసిటీ వల్ల చిన్న వయసులోనే కీళ్ల అరుగుదల కనిపిస్తోంది. ఈ తరహా ఇబ్బందులతో బాధపడే వారికి కీళ్ల మార్పిడి (జాయింట్ రీప్లేస్‌మెంట్) చేయాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అయితే కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేరుస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయలేదు. దీంతో వందలాది మంది నిరుపేదలు శస్త్రచికిత్సలు చేయించుకోలేక మంచానికే పరిమితమవుతున్నారు.

తీవ్ర ఇబ్బందులతో సతమతం..

వయసుతో నిమిత్తం లేకుండా కీళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య గడిచిన కొన్నాళ్ల నుంచి భారీగా పెరుగుతోంది. వైద్యుల వద్దకు వచ్చేవారిలో దాదాపు ఐదు శాతం మంది వారే ఉంటున్నారు. రెండు నుంచి మూడు శాతం మందికి మందులు ద్వారా కొంత ఉపశమనం కలిగించేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన రెండు శాతం మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలకు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇంప్లాంట్‌ను బట్టి శస్త్ర చికిత్సకు ఫీజు వసూలుచేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చినట్టయితే ... మిగతా 6వ పేజీలో

ఘనంగా కనకమ్మవారి పండగ



అలంకరణలో అమ్మవారు

సీతమ్మధార, మార్చి 26: గ్రేటర్ 23వ వార్డు మద్దిల పాలెం చైతన్యనగర్‌లోని గ్రామ దేవత కనకమ్మ వారి పండుగ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఈపండగలో అన్ని పార్టీల నాయకులు పాల్గొని సందడి చేశారు. ఆలయ ప్రాంగణంతో విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 26: విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు నక్కవాని పాలెం శివాలయంవీధి, క్రాంతినగర్, నక్కవాని పాలెం 60 అడుగుల రోడ్డు, జీవీఎంసీ స్కూల్ ప్రాంతం, సత్యం జంక్షన్, రీసెన్స్ కాలేజీ, శారద విద్యా నికేతన్, నక్కవానిపాలెం ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ నిలిపివేసే ప్రాంతాలు

ఆశీల్‌మెట్ట విద్యుత్ సెక్షన్ ఆఫీస్ పరిధి గురుద్వార ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున 27, 28వ తేదీల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయన్నట్టు ఈఈ బి. సింహాచలం పేర్కొన్నారు. గురుద్వారా, విజయ మెడికల్, సీతంపేట, శాంతిపురం, కైట్స్ కాలేజీ ఏరియా, జీవికే ప్లాజా, రమా ఆసుపత్రి ఏరియా, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గా గణపతి ఆలయ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాల డంపింగ్

మాధవధార, మార్చి 26: నగరం మధ్యనున్న గ్రేటరు 50వవార్డు పరిధి మాధవధారలో సింహాచలం దేవస్థానం భూములు, కొండవాలు ప్రాంతాల్లో డెబ్రిస్ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎక్కడెక్కడో పాత భవనాల్ని కూల్చిన తర్వాత వచ్చిన మట్టి పెళ్లలు, ఇటుకలు, సిమెంటు కాంక్రీటు దిమ్మెలను రహదారులపై వాహనాలతో డంపింగ్ చేస్తున్నారు. మాధవధార ఉడాకాలనీ చివర 275 సర్వే నంబరు దేవస్థానం భూముల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఎస్ఎస్‌టీఎల్ ప్రహరీని ఆనుకొని ఉండే మాధవధార ఉడాకాలనీ దేవస్థానం ఖాళీ స్థలాలు, గిరిప్రదక్షిణ దారి, మాధవధార కొండపై సింహాచల ఉప ఆలయాలైన శ్రీ మాధవస్వామి ఆలయ మార్గాల్లో వాహనాలు కదలనంతగా దారులను వ్యర్థాలతో కప్పేస్తున్నారు. 49వవార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ, శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో పలుచోట్లా ఇదే సమస్య నెలకొంటోంది. దీంతో ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం సమీప ప్రాంతాల వాసులు రాకపోకలు సాగించి ఈ దారుల్లో డెబ్రిస్ డంపింగ్ పై జీవీఎంసీ అధికారులు, క్షేత్రస్థాయి సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని నివాసితులు కోరుతున్నారు.



మాధవధారలో గిరిప్రదక్షిణ దారిలో భవన నిర్మాణ వర్థాలు

టేబుల్ టెన్నిస్‌లో విశాఖ పోర్టుకు పతకాలు



విజేతలను అభినందిసున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, అధికారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: అఖిల భారత మేజర్ పోర్ట్సు టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ పోర్టు అథారిటీ క్రీడాకారులు ఒక స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ టీమ్ ఈవెంట్‌లో తృతీయ స్థానంలో నిలిచియారు. కోల్‌కత శ్యామ్ ముఖర్జీ పోర్టు అథారిటీలో జరిగిన ఈ టోర్నీ సింగిల్స్‌లో జీవీఎస్.రామారావు స్వర్ణ పతకం, రామారావు కాంస్యం సాధించారు. డబుల్స్‌లో శ్రీధర్‌రాజు, రామారావు, కేరమురామ్‌లు రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మంగళవారం తన చాంబర్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, సీనియర్ డిప్యూటీ సీఏవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ హుండీ ఆదాయం రూ. 6. 25 లక్షలు

సీతమ్మధార, మార్చి 26: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయి బాబా ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారంనిర్వహించారు. భక్తుల నుంచి రూ. 6,25,352 లక్షలు లభించినట్టు పర్యవేక్షక అధికారి బి.శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి పైలా శేఖర్‌బాబు తెలిపారు.శ్రీహరిసేవాపీఠం భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీతమ్మధార షిర్డీసాయి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆదాయం రూ. 1.57 లక్షలు

సీతమ్మధార: నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పర్యవేక్షణ అధికారి బి.శ్రీనివాసరావు, ఆలయ ఈఓ పైలా శేఖర్‌బాబు ఆధ్వర్యంలో శ్రీహరి సేవ పీఠం భక్తులు హుండీని లెక్కించారు. ఆదాయం రూ.1,57,598 వచ్చినట్టు ఈవో తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



మాట్లాడుతున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట, మార్చి 26: ప్రజాస్వామ్యంలో ఓటు.. మన హక్కు. అని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపే మార్టిన్ లూథర్ కింగ్ సినిమా ప్రదర్శించారు. అనంతరం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన వారంతా తప్పనిసరిగా ఓటు వేయాలని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగంగా సినిమా ప్రదర్శన, చర్చ కార్యక్రమాన్ని నిర్వహించినట్టుచెప్పారు. ఈ చిత్రంలో నటించిన నగర కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కేసీహెచ్ గోపినాయుడు, మల్లికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి. చిన్నారావు, ఉషారాణి, కృష్ణారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ సుధాకర్, ప్రభు, దాట్ల బాబూరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'యాత కులస్తుల సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు'

అక్కయ్యపాలెం, మార్చి 26 : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వారికే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. ఏపీ యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సంఘం అధ్యక్షుడు నూకరాజు సంయుక్త ఆధ్వర్యంలో యాతసామాజిక వర్గ సమావేశం నరసింహనగర్‌లో మంగళవారం జరిగింది. యాత సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. అనం తరం నూకరాజు మాట్లాడుతూ తమ సామాజిక వర్గంలో కొన్ని సమస్యలు పరిష్కరమయ్యాయన్నారు. ఇంకా మిగిలిన ఉన్న సమస్యలు పరిష్కరించే వారికే రానున్న ఎన్నికల్లో మద్దతిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొల్లి సింహాచలం, సంపంగి మంగరాజు, బసరమాని ఈశ్వరరావు, గొడ్డు కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ ఉత్తరాంధ్ర నేత నూకరాజు

కూటమి అభ్యర్థులదే విజయం

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



భరత్, గండి బాబ్జీలకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 26: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేనలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థులు భారీ మెజార్టీతో ఘన విజయం సాధించనున్నట్టు విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన గండి బాబ్జీ అభినందన సభతోపాటు ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాల కార్యకర్తలు, వార్డు నాయకులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గండి బాబ్జీ వంటి సమర్థులైన నాయకత్వంలో పార్టీ విజయానికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగుదామన్నారు. విశాఖ నగర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను సాధిస్తామన్నారు. విశాఖలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, ఆకాంక్షలను తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికాయుతంగా పరిష్కరిస్తామన్నారు. అలాగే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను మరింతగా ప్రజలకు చేరేలా కార్యకర్తలు ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, 35, 44, 47, 48, 49 వార్డుల నాయకులు కొయిలాడ వెంకటేష్, యాగాటి ఆదిలక్ష్మి, గొర్లె అప్పారావు, పోతూరి మురళీ శేఖర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

జగదాంబ కూడలి, మార్చి 26: భక్తుల పాలిట కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను ఆలయ అర్చకులు నిర్వహించారు. 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉదయం 7గంటల సమయంలో ఆలయంలో నిర్వహించిన ఈ సేవల్లో భాగంగా ఉభయదాతలతో ఆలయ అర్చకులు పూజలు చేయించారు. ఉదయంనుంచి ఆలయ భక్తులతో కిటకిటలాడింది. ప్రతీ మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన సేవలో పాల్గొనదలచిన భక్తులు రూ.1.116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పోలీసులు ఓవరాక్షన్

... 5వ పేజీ తరువాయి

ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పోలీస్ జీపులో సమీపంలోని స్టేషన్‌కు తరలిస్తున్నారు. తెల్లవారుజాము వరకూ ఉంచి తర్వాత విడిచిపెడుతున్నారు. ఈనెల 24న అర్ధరాత్రి వేళ ఒక మీడియా సంస్థలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో విధులు ముగించుకుని శివాజీపాలెంలోని తన ఇంటికి బైక్‌పై వెళుతుండగా, పెదకృష్ణుడి గుడి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు ఆపారు. వాహనం రికార్డులు అడిగిన సిబ్బంది వాటిని పరిశీలించి, ఎక్కడి నుంచి వస్తున్నావంటూ ప్రశ్నించారు. తాను ఒక మీడియా సంస్థలో పనిచేస్తున్నానని డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళుతున్నానని చెప్పారు. గుర్తింపు కార్డు చూపాలని సిబ్బంది కోరగా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డుని చూపించాడు. అదికాకుండా జిల్లా కలెక్టర్ జారీచేసిన గుర్తింపు కార్డు చూపించాలని కోరడంతో తనకు అక్రిడిటేషన్ కార్డు లేదని చెప్పడంతో పోలీసులు అతని వాహనం, సెల్‌ఫోన్ తీసుకుని పోలీస్ వాహనంలో ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు విడిచిపెట్టారు. అలాగే సోమవారం మద్దిలపాలెం కూడలిలో ఎంవీపీ సీఐ, క్రైమ్ ఎస్ఐ ఆధ్వర్యంలో కొంతమంది కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీలు చేశారు. రాత్రి 12 గంటల సమయంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సమీపంలోని అపోలో ఫార్మశీకి మందుల కోసం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని పోలీసులు ఆపారు. బైక్‌ను ఆపిన తర్వాత కానిస్టేబుల్ ఒకరు వచ్చి బైక్‌ను పక్కనపెట్టి పత్రాలు చూపించాలని ఆదేశించారు. బైక్‌ను రోడ్డు పక్కకు తీస్తుండగా మరో కానిస్టేబుల్ పరుగున వచ్చి తాళాలు తీసేశారు. ఆ సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయే స్థితిలో పక్కనే ఉన్న ఎస్ఐ వాహనాన్ని పడిపోకుండా పట్టుకున్నారు. ఇదేం పద్ధతి...ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని' వాహనచోదకుడు ప్రశ్నించగా సదరు కానిస్టేబుల్ ఏకవచనంతో మాట్లాడుతూ ఎక్కువ మాట్లాడితే తెల్లవార్లు స్టేషన్‌లో కూర్చోవలసి ఉంటుందని బెదిరించారు. దీనిపై వాహనచోదకుడు 'ఎదుటి వారికి కొంచెం మర్యాద ఇచ్చి మాట్లాడండి. మీకు ఎలాంటి పత్రాలు కావాలో అడగండి. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసుకోండి. అనుమానం ఉంటే వాహనాన్ని ఉంచుకోండి. అంతేగానీ ఎదుటివారిని దూషించడం, ప్రమాదానికి గురయ్యేలా ప్రవర్తించడం మంచిది కాదు. దీనివల్ల పోలీస్ శాఖకే చెడ్డపేరు వస్తుందని' చెబుతుండగా ఎస్ఐ అక్కడకు వెళ్లి 'కుర్రాళ్లు కదా...వారి స్పీడ్ అలాగే ఉంటుంది. పట్టించుకోకండి' అని వాహన చోదకుడిని సముదాయించి పంపించేశారు. ఇంత జరుగుతున్నా పక్కనే వున్న సీఐ కనీసం పట్టించుకోనట్టు వ్యవహరించడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. నగరంలో చాలాచోట్ల పోలీస్ తనిఖీల సమయంలో కొంతమంది సిబ్బంది తీరు ఇదేమాదిరిగా ఉంటోందని నగరవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి సిబ్బందికి కౌన్సెలింగ్ చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

పశ్చిమ ఆర్‌వో హుస్సేన్ సాహెబ్



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌వో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, మార్చి 26: ఎన్నికల ఏర్పాట్లపై పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో డి.హుస్సేన్ సాహెబ్ కసరత్తు ప్రారంభించారు. మంగళవారం జ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గం ఆర్‌వో కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులు, ఏఈఆర్‌ఓలు, రాజకీయ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్ఞానాపురం, గోపాలపట్నం, జింకిగేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌వీటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు వెండి, బంగారం, నగదు, మద్యం తదితర వాటని తరలించే వారిపై నిఘా పెంచాలన్నారు. సింగిల్ విండో సిస్టమ్ కింద కంచరపాలెం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆర్‌వో కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. రాజకీయ పార్టీల వారు తప్పనిసరిగా నిర్దిష్ట సమయంలోగా ప్రచారం ముగించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు, పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, వివిధ స్టేషన్ల సీఐలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు రన్‌వే రెడీ

... 5వ పేజీ తరువాయి

చేస్తామని, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి యథా ప్రకారం 24/7 రాకపోకలకు అనుమతిస్తామని ప్రకటించారు. పగలు విమానాలు నడుపుతూ రాత్రిపూట పనులు చేస్తూ రీ సర్ఫేసింగ్ ప్రక్రియ ఒక కొలిక్కి తీసుకువచ్చారు. భారత విమానాయాన సంస్థకు చెందిన తనిఖీ ఏజెన్సీ ఈ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేసింది. రికార్డు సమయంలో నాణ్యమైన రన్‌వేను సిద్ధం చేశారంటూ నేవీ అధికారులను ప్రశంసించింది. దీనిపై ఐఎన్ఎస్ డేగా అధికారులు మాట్లాడుతూ, 'హర్ కామ్..దేశ్ కే నామ్' (దేశం కోసమే మేము పని చేస్తాం) అంటూ పేర్కొన్నారు. ఈ పనులు చేస్తున్న సమయంలో మిచౌంగ్ తుఫాన్ వచ్చిందని, అతి తక్కువ అంతరాయంతో విమానాలు నడిపామన్నారు. అంతేకాకుండా అత్యవసరం పేరుతో షెడ్యూల్ సమయం దాటిన తరువాత వచ్చిన 30 విమానాలకు అనుమతులు ఇచ్చామన్నారు.

ఉక్కు రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సంబంధించి ఏప్రిల్ నెలకు గాను ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంగళవారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ ఒకటిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీ ఎం, రెండున డబ్ల్యూఆర్ఎం, మూడున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, నాలు గున ఎస్ఎంఎస్-1, ఐదున సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, ఆరున కోక్ ఓవెన్, ఏడున కాంట్రాక్టు కార్మికులు (సీఐటీ యూ), ఎనిమిదిన సింటర్ ప్లాంట్, తొమ్మిదిన బ్లాస్ట్‌ఫర్నేస్, పదిన ఎస్ ఎంఎస్-2 విభాగాల ఉద్యోగులు, కార్మికులు దీక్షల్లో కూర్చుంటారు. అదేవిధంగా 11వ తేదీన ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 12న ఇన్‌స్ట్రుమెం టేషన్, ఆర్‌డీ, క్యూఏటీడీ, ఈటీఎల్, టెలికాం, 13న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 14న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 15న ఎల్ఎం ఎంఎం, ఎస్‌బీఎం, 16న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఆర్ఈడీ, 17న ఓబీసీ అసోసియేషన్, 18న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 17న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 18న ఈఎస్అండ్ఎఫ్, ఆర్ఎస్అండ్ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 19న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టీటీఐ, 20న ఎస్ఎంఎస్-1 ఉద్యోగులు దీక్షల్లో పాల్గొంటారు. కాగా 21వ తేదీన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 22న సింటర్ ప్లాంట్, 23న కోక్-ఓవెన్, 24న బ్లాస్ట్ ఫర్నేస్, 25న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఏస్, హెచ్ఆర్, 26న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 27న ఎస్ఎంఎస్-2, 28న కాంట్రాక్టు కార్మికులు (హెచ్ఎంఎస్), 29న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఎస్ఎండీ, 30న ఎఫ్ఎండీ, ఆర్ఎస్ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్ విభాగాల ఉద్యోగులు, కార్మికులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చుంటారని పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు.

సచివాలయంలో వలంటీర్ హవా

ఉద్యోగి కుర్చీలో కూర్చొని డేటా పరిశీలన



98వ నంబర్ సచివాలయంలో డేటా పరిశీలిస్తున్న వాలంటీర్ వాసుపల్లి దాసు

ఎం.వి.పి.కాలనీ, మార్చి 26: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మాకు సంబంధం ఏమిటీ.. మా వైఖరి మాదే అన్నట్టుంది వలంటీర్ల వ్యవహార శైలి. అధికారుల నిర్లిప్తత, ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో వలంటీర్లు తమ పరిధిలోలేని పనులకు సిద్ధమవుతున్నారు. ఓ వలంటీర్ సచివాలయంలో అక్కడి సిబ్బంది కుర్చీలో కూర్చుని, కంప్యూటర్‌లో డేటాను పరిశీలిస్తున్న సంఘటన వెలుగు చూసింది. నగరంలోని తూర్పు నియోజకవర్గం పరిధి లోనిఎం.వి.పి.కాలనీలో 98వ నంబరు సచివాలయంలో వాసుల్లి దాసు అనే వలంటీర్ దర్జాగా సచివాలయం సిబ్బంది కుర్చీలో కూర్చుని అక్కడి కంప్యూటర్‌లో ప్రజల డేటాను పరిశీలించారు. తన వద్ద ఉన్న వివరాలతో పోల్చుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అక్కడి నుంచి కాసేపటికే మాయమయ్యారు.

ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయి. ఈనెల 24 నుంచి పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా చేపట్టిన అమ్మకాలకు క్రీడాభిమానుల నుంచి సాధారణ స్పందన లభిస్తోంది. కాగా, అమ్మకాలు చేపట్టిన తొలి రెండు రోజులు కనిపించని రూ.1000, రూ.1500 ధర టికెట్లను మంగళవారం అందుబాటులో ఉంచడం గమనించదగ్గ విషయం. దీంతో మంగళవారం రాత్రి వరకు రూ.వెయ్యి, రూ.1500లతోపాటు రూ.2000, రూ.2500 రూ.3000 రూ.3500 రూ.5000 ధర టికెట్లు అం దుబాటులో ఉన్నాయి. ప్రేక్షకుల చూపులన్నీ ధోనీ ఆడుతున్న చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌పై ఉండడంతో టికెట్ల అమ్మకాలలో నిర్వాహకులు వ్యూహాత్మకంగా వ్యవహరించినా కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌కు ఆశించిన డిమాండ్ రావడం లేదని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అమ్మకాలు చేపట్టి మూడు రోజులైనా అన్ని ధరల టికెట్లు అందుబాటులో ఉండడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని చర్చ జరుగుతోంది.

నెరవేరని మరో హామీ

... 5వ పేజీ తరువాయి

ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశముంది. కానీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఈ తరహా శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారు.ప్రస్తుతం విశాఖలోనే పలు ఆస్పత్రుల్లో ఈ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. నగరంలోపదికిపైగా ఆస్పత్రుల్లో జాయింట్ రిప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో రోగులు వస్తుంటారు.

విశాఖ టీడీపీ అధ్యక్షుడిగా బాబ్జీ

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించి పలు పదవులను అలంకరించిన తరువాత 2004లో పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రెండు పర్యాయాలు అదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరిన బాబ్జీకి 2020లో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో కేడర్‌ను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని సాగించారు. ఎన్నికల్లో ఆయన అక్కడి నుంచి పోటీ చేస్తారని భావించినప్పటికీ.. ఈ సీటును జనసేనకు కేటాయించాల్సి వచ్చింది.

వచ్చే ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు అధినేత చంద్రబాబునాయుడుకు గండి బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళతానన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాల మేరకు పనిచేసి ఫలితాలను రాబడతామని బాబ్జీ వెల్లడించారు. పార్టీలోని సీనియర్ నాయకుల నుంచి కింది స్థాయి కేడర్ వరకు అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. అదే సమయంలో దక్షిణ నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ ఉంటానని వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 26: వేసవిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి కొరతలేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తాగునీరు వృథా కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన తాగునీటి అవసరాల సన్నద్ధతపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటి వనరులు, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో తక్కువగా వర్షపాతం నమోదయ్యిందని అదే పరిస్థితి ఇంకా కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో నీటి సౌలభ్యతను ముందుగానే అంచనా వేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి బోర్లు, మోటార్లు, పైపులు, ట్యాపులు మరమ్మతులకు గురైతే వాటిని వెంటనే సరిచేయాలన్నారు. నీరు వృథా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏలేరు, గోదావరి, గోస్తనీ, రాయిపూడి, తాటిపూడి, మేహాద్రిగెడ్డ, గంభీరం, ముడసర్లోవ రిజర్వాయర్‌లనుంచి తాగునీరు లభిస్తుందన్నారు. నగరంలో ఏలేరు నీటిని అధికంగా వినియోగిస్తున్నామన్నారు. తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీవీ చౌదరి, జడ్పీ డిప్యూటీ సీఈఓ డి.సత్యనారాయణ, జీవీఎంసీ వాటర్ సప్లై పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎస్ రవి, వాటర్ సోర్సెస్ పర్యవేక్షక ఇంజనీర్ కె.సూర్యకుమార్, డీపీవో ఎంవీఏ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ, జనసేన, బీజేపీ గాజువాక నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళదాం

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై సీఎం జగన్ ఒక్కసారైనా కేంద్రంతో మాట్లాడారా?
- నన్ను గెలిపిస్తే 'ఉక్కు' అంశంపై పోరాడతా..
- టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్

కూర్మన్నపాలెం, మార్చి 26: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై సీఎం జగన్ ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని తెలుగుదేశం పార్టీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో మంగళవారం జరిగిన గాజువాక నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్కు కర్మాగారం విషయంపై కేంద్రంతో మాట్లాడాలన్నా.. పోట్లాడాలన్నా ఎంపీగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన మనందరిపై ఉందన్నారు. మాటకు కట్టుబడే వ్యక్తి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అని, అలాంటి నిస్వార్థప రున్ని తిట్టడం వల్లే గుడివాడ అమర్‌నాథ్‌కు మంత్రి పదవి ఇచ్చారన్న సత్యాన్ని గాజువాక నియోజకవర్గ ప్రజలు గ్రహించాలన్నారు. పరిశ్రమల శాఖా మంత్రిగా అమర్‌నాథ్ తన ఊరుకు, గాజువాకకు కానీ విశాఖకు గానీ చేసిందేమీ లేదన్న విషయాన్ని ప్రజలందరూ గ్రహించారన్నారు. ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓట్ల రూపంలో అమర్‌నాథ్‌కు, వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. గాజువాక ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మంచి వ్యక్తి అని, ఉక్కు కర్మాగారం రక్షణ కోసం, నిర్వాసితుల వాణిని వినిపించేందుకు ఆయనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

గాజువాక ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి హఠావో-ఆంధ్రప్రదేశ్ బచావో నినాదంతో వైసీపీకి చరమగీతం పాడేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రశాంత నగరంగా పేరొందిన విశాఖను గంజాయికి, మాదకద్రవ్యాలకు అడ్డాగా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందని మండిపడ్డారు. గాజువాకలోకి భూ సమస్య, ఉక్కు ప్రైవేటీకరణ, టోల్‌గేటు, గంగవరం, మత్స్యకారుల సమస్య, ఏపీఐఐసీ భూముల పరిరక్షణ, తదితర సమస్యలను తాను గెలిచిన మూడు నెలల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ పల్లా శ్రీనవాసరావు గెలుపే పవన్ కల్యాణ్ గెలుపు అని అన్నారు. మనందరి లక్ష్యం వైసీపీ అరాచక పాలనకు అంతం పలకడమేనన్నారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ పీఎం మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మట్లాడుతూ రామరాజ్యం కావాలంటే టీడీపీని గెలిపించాలన్నారు.

ఈ సమావేశానికి టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, పల్లా శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, రౌతు శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, తెలుగు మహిళ విశాఖ అధ్యక్షురాలు అనంత లక్ష్మి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పుచ్చా విజయ కుమార్, దీనంకొండ కృష్ణంరాజు, పావని, బాటా శ్రీను, సోంబాబు, దల్లి గోవింద రెడ్డి, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, కె.కనకారావు, లంకల మురళీదేవి, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో గణబాబు

టీడీపీతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు

పశ్చిమ ఎమ్మెల్యే, నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు

మల్కాపురం, మార్చి 26: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి పి.గణబాబు అన్నారు. 59వ వార్డు పరిధి గంగానగర్‌లో టీడీపీలో ఎంతోమంది చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఈ వార్డు నుంచే ఎంతోమంది వరసగా టీడీపీలో చేరుతుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలందరూ ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, టీడీపీ నాయకులు మితిరెడ్డి శంకర్, రామ్మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ డిపో రహదారి

తరచూ మరమ్మతులకు గురవుతున్న బస్సులు



మట్టి, గోతులతో నిండిన గాజువాక ఆర్టీసీ డిపోలోని రోడ్డు

మల్కాపురం, మార్చి 26: గాజువాక ఆర్టీసీ డిపోలోని రోడ్డు అధ్వానంగా మారింది. ఇది మట్టి రోడ్డు కావడం..రాళ్లు తేలడం వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయమై మరింత ఇబ్బందికరంగా మారుతుంది. విశాఖలోని అన్ని ఆర్టీసీ డిపోలలోని రోడ్లు బాగానే ఉంటాయని, ఇక్కడి రహదారికి మాత్రంత ఏళ్లు గడుస్తున్నా మోక్షం లభించడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ రహదారి గురించి పట్టించుకునే అధికారులే కరువయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడ గోతులు ఉండడం వల్ల బస్సులు వాటి మీదుగా రాకపోకలు సాగిస్తూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డిపోలో రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం: నలుగురి అరెస్టు

పెందుర్తి, మార్చి 26: ఒడిశా నుంచి విశాఖ నగరానికి కారులో తరలిస్తున్న 20 కిలోల గంజాయితో పాటు రూ.10 వేలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎల్.రామకృష్ణ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి వస్తున్న కారును సరిపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో భద్రపరిచిన గంజాయి లభ్యమైంది. దీంతో కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్దనున్న రూ.10 వేలను స్వాధీనం పరుచుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

పాత గాజువాకలో 16 కిలోలతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

గాజువాక: పాడేరు నుంచి తమిళనాడుకు తరలిస్తున్న 16 కిలోల గంజాయిని పాత గాజువాకలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన సాయిసతీశ్ అనే వ్యక్తి పాడేరు నుంచి 16 కిలోల గంజాయి తెచ్చి తమిళనాడుకు చెందిన కన్నల్‌కు అందజేసేందుకు పాత గాజువాక వచ్చాడు. గంజాయి అందజేస్తున్న సమయంలో పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

ఉక్కు స్టేడియంలో క్రికెట్ నెట్స్ ప్రారంభం



క్రికెట్ నెట్స్‌ను ప్రారంభిస్తున్న సీఎస్ఆర్ గోపినాథరెడ్డి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26: స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్‌ను మంగళవారం రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సీఎస్ఆర్ గోపినాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు నేడు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఉక్కు యాజమన్యాం క్రీడలకు అధిక ప్రాధన్యత ఇచ్చి శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. ఉక్కు సీజీఎం కెహెచ్.ప్రకాష్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ కోసం ప్రత్యేక వసతులు కల్పించామని, అన్ని వేళల శిక్షణ తీసుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ క్రికెట్ కోచ్ డీఆర్.శ్రీనివాస్, పలువురు అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రైతు బజారులో విక్రయిస్తున్న టమాటా

తగ్గుముఖం పట్టిన టమాటా ధర

రైతు బజారులో కిలో రూ.12కు విక్రయం

మరింత తగ్గే అవకాశం ఉందంటున్న రైతులు

గోపాలపట్నం, మార్చి 26: జిల్లాలో టమటా సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో వీటి ధర కాస్త తగ్గుముఖం పట్టింది. సాధారణంగా డిసెంబరు నెల నుంచి జిల్లాలో దేశవాళీ టమాటాల సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు టమాటా దిగుబడి అధికంగా ఉంటుంది. దీంతో జనవరి నుంచి ఏప్రిల్ వరకు టమాటా ధర తగ్గుముఖం పడుతుంది. దీంతో ప్రస్తుతం రైతు బజారులో కిలో టమటా రూ.12కు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉండడంతో రైతులు పెద్దమొత్తంలో వీటిని బజార్లకు తెచ్చి విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో టమాట ధర మరింత తగ్గే అవకాశం ఉందని పలువురు వర్తకులు చెబుతున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మల్కాపురం, మార్చి 26: అందరూ ఉండి అనాథగా మృతి చెందిన ఓ వ్యక్తికి పోలీసుల సహకారంతో పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ మంగళవారం మల్కాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీహరిపురానికి చెందిన కోమటి అప్పలనాయుడు కుటుంబం ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల వారికి దూరంగా ఉంటూ యాచకునిగా జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో సోమవారం ఉదయం ఆయనను 108 వాహనం ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అప్పలనాయుడు మృతి చెందడంతో పోస్టుమార్టం చేసి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. అయితే ఆయన బంధువులెవరూ రాకపోవడంతో సురేశ్, తదితరులు అంత్యక్రియలు జరిపారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 18, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 20, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 70, కీర దోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



ఆడారి ఆనంద్‌కుమార్‌కు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న ప్రజలు



ఆనంద్‌కుమార్ సమక్షంలో పలువురు వైసీపీలో చేరిన దృశ్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఎంతో మేలు

పశ్చిమ 'అభ్యర్థి' ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, మార్చి 26: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందని, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు పరిధిలోని ఎదురువానిపాలెం, ములగాడ, చిన ములగాడ, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వైసీపీ పాలనను చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, వీటిని ప్రజలందరూ తిప్పికొట్టాలన్నారు. కరోనా సమయంలో సీఎం జనగ్ ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. కాగా ఆనంద్‌కుమార్‌కు ప్రజలు పూలమాలలు వేసి, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

వైసీపీలో పలువురు చేరిక

ఈ సందర్భంగా 58వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 కుటుంబాల సభ్యులు ఆనంద్‌కుమార్ సమక్షంలో వైసీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై ఎంతోమంది వైసీపీలో చేరుతుండడం ఎంతో ఆనందంగా ఉందని ఆయనన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైసీపీ పశ్చిమ పరిశీలకురాలు పి.ఉమారాణి, నాయకులు దాట్ల శ్రీనివాసరాజు (పొడుగు రాజు), అంగ రామ్‌ప్రసాద్, తోణంగి వెంకటరమణి, చుక్క వరలక్ష్మి, మళ్ల ధనలత, జి.పెద్ద సత్యనారాయణరెడ్డి, చిన సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు



71వ వార్డులో పూజలందుకున్న పైడితల్లమ్మ... పక్కన అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

శ్రీనగర్, మార్చి 26: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీవాసుల ఆరాధ్య దైవం పైడితల్లమ్మ పండుగను దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పైడిమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పండుగ నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు ఫణిశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు చేశాక పైడితల్లమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. వందలాదిగా విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర



అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పైడిమాంబ జాతరను వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట (మంగళవారం తెల్లవారు జాము) నుంచే అమ్మవారి దర్శనాలను ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమ, పట్టు వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు జరిపారు. జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే ఫార్మాసిటీ పునరావాస కాలనీలో చింతాలమ్మ అమ్మవారు, ఏదూరి వానిపాలెంలో పైడిమాంబ అమ్మవారు, పినమడక బోయమాంబ అమ్మవారు, కొండయ్యవలసలో బంగారమ్మ అనుపోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

74వ వార్డులో స్వర్ణ నూకాంబిక..

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాళ్‌నగర్ క్వారీ రోడ్డులో స్వర్ణ నూకాంబిక ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. వివిధ రకాల పండ్లు, పిండివంటలు, నూతన వస్త్రాలతో సారె ఊరేగింపు జరిపారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు నూకాంబికను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, రాజారావు, రమణ, పవన్‌కుమార్, రామసూరి, సీతారామ్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముత్యాలమ్మ ఉత్సవాలు



ముత్యాలమ్మను ఊరేగిస్తున్న పాల్గొన్న భక్తులు

వేపగుంట: నాయుడుతోట పరిసర 14 గ్రామాల ప్రజల ఇలవేల్పు ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపుతో పాటు అమ్మవారి మాలధారణ చేసిన సుమారు 200 మంది భక్తులు అగ్నిగుండంలో నడిచారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం తొలేళ్ల పండుగను జరపనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

వాలీబాల్ పోటీల విజేత 'పైడిమాంబ' జట్టు

పెదగంట్యాడ, మార్చి 26: పెద నడుపూరు పైడిమాంబ వార్షికోత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నడుపూరు, గొంతెనవానిపాలెం జట్లు నిలిచాయి. పెదనడుపూరు మైదానంలో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు విచ్చేసి విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పి.సన్ని, పి.కృష్ణ, పల్లం రవి, ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ఎం.అచ్చింనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించే వారికే మద్దతివ్వండి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 26: వార్డు అభివృద్ధికి సహకరించే నాయకులకే రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపేందుకు ప్రయత్నించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. నాతయ్యపాలెంలో మంగళవారం నూతనంగా ఏర్పాటైన కేజీఆర్ యువసేన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేజీఆర్ యువసేన తీసుకునే సమష్టి నిర్ణయం వార్డు అభివృద్ధితో పాటు యువత, మహిళ సంక్షేమానికి ఉపయోగపడాలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువసేన నాయకులు గోపిశెట్టి ఆదినారాయణ, సీహెచ్ అప్పారావు, ఎస్.వరహాలరాజు, వి.గోపి, జి.శ్రీను, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

కూర్మన్నపాలెం, మార్చి 26: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి భవితా కేంద్రంలో మంగళవారం సమగ్రశిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ దివ్యాంగులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. దివ్యాంగులకు ఏఏ ఉపకరణాలు అవసరమో వాటిని నిర్ధారించేందుకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కొద్ది రోజుల్లో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేస్తామని అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ శిబిరానికి సుమారు 150 మంది దివ్యాంగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ, ములగాడ ఎంఈవోలు, కేజీహెచ్‌లోని వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రంజనీకుమారి, తారకేశ్వరరావు, నాగరాజు, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకుంటాం'

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆటో డ్రైవర్ మొల్లేటి ఉట్టిబాబు కుటుంబాన్ని ఆదుకుంటామని సింహాద్రి టీఎంటీ కంపెనీ చైర్మన్ సురేష్‌కుమార్ భరోసా ఇచ్చినట్టు మృతుని బంధువులు తెలిపారు. సోమవారం ఎయిర్‌పోర్టు జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుంచి సింహాద్రి టీఎంటీ కంపెనీకి చెందిన లారీ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఉట్టిబాబు మృతిచెందడంతో అతని తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డునపడ్డారు. ఈ విషయాన్ని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు, గాజువాక టీడీపీ నేతల పల్లా శ్రీనివాసరావులు కంపెనీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా...ఆయన స్పందించి ఆదుకుంటానని చెప్పారు. ఆయన ఆదేశాలతో కంపెనీ ప్రతినిధులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం వెలిబుచ్చారు.

వైభవంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, మార్చి 26: మండలంలోని పెదగాడిలో గల అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనీపుత్రునికి సింధూరం, లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు హనుమాన్ చాలీసాను పఠించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశుబోయిన లావణ్య త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మవారి పండగ



అలంకరణలో అమ్మవారు

సీతమ్మధార, మార్చి 26: గ్రేటర్ 23వ వార్డు మద్దిలపాలెం చైతన్యనగర్‌లోని గ్రామ దేవత కనకమ్మ వారి పండుగ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఈపండగలో అన్ని పార్టీల నాయకులు పాల్గొని సందడి చేశారు. ఆలయ ప్రాంగణంతో విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 26: విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు నక్కవానిపాలెం శివాలయంవీధి, క్రాంతినగర్, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు, జీవీఎంసీ స్కూల్ ప్రాంతం, సత్యం జంక్షన్, రీసెన్స్ కాలేజీ, శారద విద్యానికేతన్, నక్కవానిపాలెం ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ నిలిపివేసే ప్రాంతాలు

ఆశీల్‌మెట్ట విద్యుత్ సెక్షన్ ఆఫీస్ పరిధి గురుద్వార ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున 27, 28వ తేదీల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ బి. సింహాచలం పేర్కొన్నారు. గురుద్వారా, విజయ మెడికల్, సీతంపేట, శాంతిపురం, కైట్స్ కాలేజీ ఏరియా, జీవీకే ప్లాజా, రమా ఆసుపత్రి ఏరియా, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గా గణపతి ఆలయ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాల డంపింగ్

మాధవధార, మార్చి 26: నగరం మధ్యనున్న గ్రేటరు 50వవార్డు పరిధి మాధవధారలో సింహాచలం దేవస్థానం భూములు, కొండవాలు ప్రాంతాల్లో డెబ్రిస్ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎక్కడెక్కడో పాత భవనాల్ని కూల్చిన తర్వాత వచ్చిన మట్టి పెళ్లలు, ఇటుకలు, సిమెంటు కాంక్రీటు దిమ్మెలను రహదారులపై వాహనాలతో డంపింగ్ చేస్తున్నారు. మాధవధార ఉడాకాలనీ చివర 275 సర్వే నంబరు దేవస్థానం భూముల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఎస్ఎస్‌టీఎల్ ప్రహరీని ఆనుకొని ఉండే మాధవధార ఉడాకాలనీ దేవస్థానం ఖాళీ స్థలాలు, గిరిప్రదక్షిణ దారి, మాధవధార కొండపై సింహాచల ఉప ఆలయాలైన శ్రీ మాధవస్వామి ఆలయ మార్గాల్లో వాహనాలు కదలనంతగా దారులను వ్యర్థాలతో కప్పేస్తున్నారు. 49వవార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ, శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో పలుచోట్లా ఇదే సమస్య నెలకొంటోంది. దీంతో ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం సమీప ప్రాంతాల వాసులు రాకపోకలు సాగించి ఈ దారుల్లో డెబ్రిస్ డంపింగ్ పై జీవీఎంసీ అధికారులు, క్షేత్రస్థాయి సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని నివాసితులు కోరుతున్నారు.



మాధవధారలో గిరిప్రదక్షిణ దారిలో భవన నిర్మాణ వ్యర్థాలు

టేబుల్ టెన్నిస్‌లో విశాఖ పోర్టుకు పతకాలు



విజేతలను అభినందిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, అధికారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: అఖిల భారత మేజర్ పోర్ట్సు టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ పోర్టు అథారిటీ క్రీడాకారులు ఒక స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ టీమ్ ఈవెంట్‌లో తృతీయ స్థానంలో నిలిచియారు. కోల్‌కత శ్యామ్ ముఖర్జీ పోర్టు అథారిటీలో జరిగిన ఈ టోర్నీ సింగిల్స్‌లో జీవీఎస్.రామారావు స్వర్ణ పతకం, రామారావు కాంస్యం సాధించారు. డబుల్స్‌లో శ్రీధర్‌రాజు, రామారావు, కేరఘురామ్‌లు రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మంగళవారం తన చాంబర్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, సీనియర్ డిప్యూటీ సీఏవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ హుండీ ఆదాయం రూ. 6. 25 లక్షలు



సీతమ్మధార షిర్డీసాయి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

సీతమ్మధార, మార్చి 26: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయి బాబా ఆలయంలో హుండీ లెక్కింపును మంగళవారంనిర్వహించారు. భక్తుల నుంచి రూ. 6,25,352 లక్షలు లభించినట్టు పర్యవేక్షక్ష అధికారి బి.శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి పైలా శేఖర్‌బాబు తెలిపారు.శ్రీహరిసేవాపీఠం భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆదాయం రూ. 1.57 లక్షలు

సీతమ్మధార: నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పర్యవేక్షణ అధికారి బి.శ్రీనివాసరావు, ఆలయ ఈఓ పైలా శేఖర్‌బాబు ఆధ్వర్యంలో శ్రీహరి సేవ పీఠం భక్తులు హుండీని లెక్కించారు. ఆదాయం రూ.1,57,598 వచ్చినట్టు ఈవో తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



మాట్లాడుతున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట, మార్చి 26: ప్రజాస్వామ్యంలో ఓటు.. మన హక్కు అని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపే మార్టిన్ లూథర్ కింగ్ సినిమా ప్రదర్శించారు. అనంతరం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన వారంతా తప్పనిసరిగా ఓటు వేయాలని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగంగా సినిమా ప్రదర్శన, చర్చ కార్యక్రమాన్ని నిర్వహించినట్టుచెప్పారు. ఈ చిత్రంలో నటించిన నగర కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కేసీహెచ్ గోపినాయుడు, మల్లికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి. చిన్నారావు, ఉషారాణి, కృష్ణారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ సుధాకర్, ప్రభు, దాట్ల బాబూరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'యాత కులస్తుల సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు'



మాట్లాడుతున్న సంఘ ఉత్తరాంధ్ర నేత నూకరాజు

అక్కయ్యపాలెం, మార్చి 26 : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వారికే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. ఏపీ యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సంఘం అధ్యక్షుడు నూకరాజు సంయుక్త ఆధ్వర్యంలో యాతసామాజిక వర్గ సమావేశం నరసింహనగర్‌లో మంగళవారం జరిగింది. యాత సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నూకరాజు మాట్లాడుతూ తమ సామాజిక వర్గంలో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఇంకా మిగిలిన ఉన్న సమస్యలు పరిష్కరించే వారికే రానున్న ఎన్నికల్లో మద్దతిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొల్లి సింహాచలం, సంపంగి మంగరాజు, బసరమాని ఈశ్వరరావు, గొడ్డు కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులదే విజయం

» టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



భరత్, గండి బాబ్జీలకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 26: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేనలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థులు భారీ మెజార్టీతో ఘన విజయం సాధించనున్నట్టు విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన గండి బాబ్జీ అభినందన సభతోపాటు ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాల కార్యకర్తలు, వార్డు నాయకులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గండి బాబ్జీ వంటి సమర్థులైన నాయకత్వంలో పార్టీ విజయానికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగుదామన్నారు. విశాఖ నగర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను సాధిస్తామన్నారు. విశాఖలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, ఆకాంక్షలను తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికాయుతంగా పరిష్కరిస్తామన్నారు. అలాగే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను మరింతగా ప్రజలకు చేరేలా కార్యకర్తలు ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్, 35, 44, 47, 48, 49 వార్డుల నాయకులు కొయిలాడ వెంకటేష్, యాగాటి ఆదిలక్ష్మి, గొర్లె అప్పారావు, పోతూరి మురళీ శేఖర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

జగదాంబ కూడలి, మార్చి 26: భక్తుల పాలిట కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను ఆలయ అర్చకులు నిర్వహించారు. 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఉద యం 7గంటల సమయంలో ఆల యం లో నిర్వహించిన ఈ సేవల్లో భాగంగా ఉభయదాతలతో ఆలయ అర్చకులు పూజలు చేయించారు. ఉదయంనుంచి ఆల య భక్తులతో కిటకిటలాడింది. ప్రతీ మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన సేవలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పోలీసులు ఓవరాక్షన్

... 5వ పేజీ తరువాయి

ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పోలీస్ జీపులో సమీపంలోని స్టేషన్‌కు తరలిస్తున్నారు. తెల్లవారుజాము వరకూ ఉంచి తర్వాత విడిచిపెడుతున్నారు. ఈనెల 24న అర్ధరాత్రి వేళ ఒక మీడియా సంస్థలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో విధులు ముగించుకుని శివాజీపాలెంలోని తన ఇంటికి బైక్‌పై వెళుతుండగా, పెదకృష్ణుడి గుడి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు ఆపారు. వాహనం రికార్డులు అడిగిన సిబ్బంది వాటిని పరిశీలించి, ఎక్కడి నుంచి వస్తున్నావంటూ ప్రశ్నించారు. తాను ఒక మీడియా సంస్థలో పనిచేస్తున్నానని డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళుతున్నానని చెప్పారు. గుర్తింపు కార్డు చూపాలని సిబ్బంది కోరగా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డుని చూపించాడు. అదికాకుండా జిల్లా కలెక్టర్ జారీచేసిన గుర్తింపు కార్డు చూపించాలని కోరడంతో తనకు అక్రిడిటేషన్ కార్డు లేదని చెప్పడంతో పోలీసులు అతని వాహనం, సెల్‌ఫోన్ తీసుకుని పోలీస్ వాహనంలో ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు విడిచిపెట్టారు. అలాగే సోమవారం మద్దిలపాలెం కూడలిలో ఎంవీపీ సీఐ, క్రైమ్ ఎస్ఐ ఆధ్వర్యంలో కొంతమంది కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీలు చేశారు. రాత్రి 12 గంటల సమయంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సమీపంలోని అపోలో ఫార్మశీకి మందుల కోసం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని పోలీసులు ఆపారు. బైక్‌ను ఆపిన తర్వాత కానిస్టేబుల్ ఒకరు వచ్చి బైక్‌ను పక్కనపెట్టి పత్రాలు చూపించాలని ఆదేశించారు. బైక్‌ను రోడ్డు పక్కకు తీస్తుండగా మరో కానిస్టేబుల్ పరుగున వచ్చి తాళాలు తీసేశారు. ఆ సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయే స్థితిలో పక్కనే ఉన్న ఎస్ఐ వాహనాన్ని పడిపోకుండా పట్టుకున్నారు. ఇదేం పద్ధతి..ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని' వాహనచోదకుడు ప్రశ్నించగా సదరు కానిస్టేబుల్ ఏకవచనంతో మాట్లాడుతూ ఎక్కువ మాట్లాడితే తెల్లవార్లు స్టేషన్‌లో కూర్చోవలసి ఉంటుందని బెదిరించారు. దీనిపై వాహనచోదకుడు 'ఎదుటి వారికి కొంచెం మర్యాద ఇచ్చి మాట్లాడండి. మీకు ఎలాంటి పత్రాలు కావాలో అడగండి. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసుకోండి. అనుమానం ఉంటే వాహనాన్ని ఉంచుకోండి. అంతేగానీ ఎదుటివారిని దూషించడం, ప్రమాదానికి గురయ్యేలా ప్రవర్తించడం మంచిది కాదు. దీనివల్ల పోలీస్ శాఖకే చెడ్డపేరు వస్తుందని' చెబుతుండగా ఎస్ఐ అక్కడకు వెళ్లి 'కుర్రాళ్లు కదా...వారి స్పీడ్ అలాగే ఉంటుంది. పట్టించుకోకండి' అని వాహన చోదకుడిని సముదాయించి పంపించేశారు. ఇంత జరుగుతున్నా పక్కనే వున్న సీఐ కనీసం పట్టించుకోనట్టు వ్యవహరించడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. నగరంలో చాలాచోట్ల పోలీస్ తనిఖీల సమయంలో కొంతమంది సిబ్బంది తీరు ఇదేమాదిరిగా ఉంటోందని నగరవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిసారించి సిబ్బందికి కౌన్సెలింగ్ చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

» పశ్చిమ ఆర్‌వో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, మార్చి 26: ఎన్నికల ఏర్పాట్లపై పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో డి.హుస్సేన్ సాహెబ్ కసరత్తు ప్రారంభించారు. మంగళవారం జ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గం ఆర్‌వో కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులు, ఏఈఆర్‌ఓలు, రాజకీయ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్ఞానాపురం, గోపాలపట్నం, జింక్‌గేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌వీటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు వెండి, బంగారం, నగదు, మద్యం తదితర వాటని తరలించే వారిపై నిఘా పెంచాలన్నారు. సింగిల్ విండో సిస్టమ్ కింద కంచరపాలెం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆర్‌వో కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. రాజకీయ పార్టీల వారు తప్పనిసరిగా నిర్దిష్ట సమయంలోగా ప్రచారం ముగించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు, పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, వివిధ స్టేషన్ల సీఐలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌వో హుస్సేన్ సాహెబ్

ఉక్కు రిలే నిరాహార దీక్షల కార్యచరణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 26: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సంబంధించి ఏప్రిల్ నెలకు గాను ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంగళవారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ ఒకటిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీ ఎం, రెండున డబ్ల్యూఆర్ఎం, మూడున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, నాలు గున ఎస్ఎంఎస్-1, ఐదున సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, ఆరున కోకో ఓవెన్, ఏడున కాంట్రాక్టు కార్మికులు (సీఐటీ యూ), ఎనిమిదిన సింటర్ ప్లాంట్, తొమ్మిదిన బ్లాస్ట్‌ఫర్నేస్, పదిన ఎస్ ఎంఎస్-2 విభాగాల ఉద్యోగులు, కార్మికులు దీక్షల్లో కూర్చుంటారు. అదేవిధంగా 11వ తేదీన ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్ ఆర్ఎండీ, 12న ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆర్‌డీ, క్యూఏటీడీ, ఈటీఎల్, టెలికాం, 13న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 14న కాంట్రాక్టు కార్మికులు (వైఎస్సార్‌టీయూసీ), 15న ఎల్ఎం ఎం, ఎస్‌బీఎం, 16న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఆర్ఈడీ, 17న ఓబీసీ అసోసియేషన్, 18న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 17న ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, 18న ఈఎస్అండ్ఎఫ్, ఆర్ఎస్అండ్ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 19న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టీటీఐ, 20న ఎస్ఎంఎస్-1 ఉద్యోగులు దీక్షల్లో పాల్గొంటారు. కాగా 21వ తేదీన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 22న సింటర్ ప్లాంట్, 23న కోక్-ఓవెన్, 24న బ్లాస్ట్ ఫర్నేస్, 25న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్, 26న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 27న ఎస్ఎంఎస్-2, 28న కాంట్రాక్టు కార్మికులు (హెచ్ఎంఎస్), 29న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఎస్ఎండీ, 30న ఎఫ్ఎండీ, ఆర్ఎస్ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్ విభాగాల ఉద్యోగులు, కార్మికులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చుంటారని పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు.

సచివాలయంలో వలంటీర్ హవా

ఉద్యోగి కుర్చీలో కూర్చొని డేటా పరిశీలన



98వ నంబర్ సచివాలయంలో డేటా పరిశీలిస్తున్న వాలంటీర్ వాసుపల్లి దాసు

ఎం.వి.పి.కాలనీ, మార్చి 26: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మాకు సంబంధం ఏమిటి.. మా వైఖరి మాదే అన్నట్టుంది వలంటీర్ల వ్యవహార శైలి. అధికారుల నిర్లిప్తత, ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో వలంటీర్లు తమ పరిధిలోలేని పనులకు సిద్ధమవుతున్నారు. ఓ వలంటీర్ సచివాలయంలో అక్కడి సిబ్బంది కుర్చీలో కూర్చుని, కంప్యూటర్‌లో డేటాను పరిశీలిస్తున్న సంఘటన వెలుగు చూసింది. నగరంలోని తూర్పు నియోజకవర్గం పరిధిలోనిఎం.వి.పి.కాలనీలో 98వ నంబరు సచివాలయంలో వాసుల్లి దాసు అనే వలంటీర్ దర్జాగా సచివాలయం సిబ్బంది కుర్చీలో కూర్చుని అక్కడి కంప్యూటర్‌లో ప్రజల డేటాను పరిశీలించారు. తన వద్ద ఉన్న వివరాలతో పోల్చుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అక్కడి నుంచి కాసేపటికే మాయమయ్యారు.

ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయి. ఈనెల 24 నుంచి పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా చేపట్టిన అమ్మకాలకు క్రీడాభిమానుల నుంచి సాధారణ స్పందన లభిస్తోంది. కాగా, అమ్మకాలు చేపట్టిన తొలి రెండు రోజులు కనిపించని రూ.1000, రూ.1500 ధర టికెట్లను మంగళవారం అందుబాటులో ఉంచడం గమనించదగ్గ విషయం. దీంతో మంగళవారం రాత్రి వరకు రూ.వెయ్యి, రూ.1500లతోపాటు రూ.2000, రూ.2500 రూ.3000 రూ.3500 రూ.5000 ధర టికెట్లు అం దుబాటులో ఉన్నాయి. ప్రేక్షకుల చూపులన్నీ ధోనీ ఆడుతున్న చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌పై ఉండడంతో టికెట్ల అమ్మకాలలో నిర్వాహకులు వ్యూహాత్మకంగా వ్యవహరించినా కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌కు ఆశించిన డిమాండ్ రావడం లేదని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అమ్మకాలు చేపట్టి మూడు రోజులైనా అన్ని ధరల టికెట్లు అందుబాటులో ఉండడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టు రన్‌వే రెడీ

... 5వ పేజీ తరువాయి

చేస్తామని, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి యథా ప్రకారం 24/7 రాకపోకలకు అనుమతిస్తామని ప్రకటించారు. పగలు విమానాలు నడుపుతూ రాత్రిపూట పనులు చేస్తూ రీ సర్ఫేసింగ్ ప్రక్రియ ఒక కొలిక్కి తీసుకువచ్చారు. భారత విమానాయాన సంస్థకు చెందిన తనిఖీ ఏజెన్సీ ఈ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేసింది. రికార్డు సమయంలో నాణ్యమైన రన్‌వేను సిద్ధం చేశారంటూ నేవీ అధికారులను ప్రశంసించింది. దీనిపై ఐఎన్ఎస్ డేగా అధికారులు మాట్లాడుతూ, 'హర్ కామ్..దేశ్ కే నామ్' (దేశం కోసమే మేము పని చేస్తాం) అంటూ పేర్కొన్నారు. ఈ పనులు చేస్తున్న సమయంలో మిచౌంగ్ తుఫాన్ వచ్చిందని, అతి తక్కువ అంతరాయంతో విమానాలు నడిపామన్నారు. అంతేకాకుండా అత్యవసరం పేరుతో షెడ్యూల్ సమయం దాటిన తరువాత వచ్చిన 30 విమానాలకు అనుమతులు ఇచ్చామన్నారు.

నెరవేరని మరో హామీ

... 5వ పేజీ తరువాయి

ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశముంది. కానీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఈ తరహా శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారు.ప్రస్తుతం విశాఖలోనే పలు ఆస్పత్రుల్లో ఈ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. నగరంలోపదికిపైగా ఆస్పత్రుల్లో జాయింట్ రిప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో రోగులు వస్తుంటారు.

విశాఖ టీడీపీ అధ్యక్షుడిగా బాబ్జీ

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించి పలు పదవులను అలంకరించిన తరువాత 2004లో పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రెండు పర్యాయాలు అదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరిన బాబ్జీకి 2020లో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో కేడర్‌ను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని సాగించారు. ఎన్నికల్లో ఆయన అక్కడి నుంచి పోటీ చేస్తారని భావించినప్పటికీ.. ఈ సీటును జనసేనకు కేటాయించాల్సి వచ్చింది.

వచ్చే ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు అధినేత చంద్రబాబునాయుడుకు గండి బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళతానన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాల మేరకు పనిచేసి ఫలితాలను రాబడతామని బాబ్జీ వెల్లడించారు. పార్టీలోని సీనియర్ నాయకుల నుంచి కింది స్థాయి కేడర్ వరకు అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. అదే సమయంలో దక్షిణ నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ ఉంటానని వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

» అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

విశాఖపట్నం, మార్చి 26: వేసవిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి కొరతలేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తాగునీరు వృథా కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన తాగునీటి అవసరాల సన్నద్ధతపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటి వనరులు, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో తక్కువగా వర్షపాతం నమోదయ్యిందని అదే పరిస్థితి ఇంకా కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో నీటి సౌలభ్యతను ముందుగానే అంచనా వేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి బోర్లు, మోటార్లు, పైపులు, ట్యాపులు మరమ్మతులకు గురైతే వాటిని వెంటనే సరిచేయాలన్నారు. నీరు వృథా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏలేరు, గోదావరి, గోస్తనీ, రాయిపూడి, తాటిపూడి, మేహాద్రిగెడ్డ, గంభీరం, ముడసర్లోవ రిజర్వాయర్‌లనుంచి తాగునీరు లభిస్తుందన్నారు. నగరంలో ఏలేరు నీటిని అధికంగా వినియోగిస్తున్నామన్నారు. తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీవీ చౌదరి, జడ్పీ డిప్యూటీ సీఈఓ డి.సత్యనారాయణ, జీవీఎంసీ వాటర్ సప్లై పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎస్ రవి, వాటర్ సోర్సెస్ పర్యవేక్షక ఇంజనీర్ కె.సూర్యకుమార్, డీపీవో ఎంవీఏ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

శ్రీభరత్‌కు బీజేపీ నేతల అభినందన


శ్రీభరత్‌ను సత్కరిస్తున్న నేతలు

భీమునిపట్నం, మార్చి 26: విశాఖ పార్లమెంట్ ఎన్డీఏ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో బీజేపీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కె.రామానాయుడు, ఆ పార్టీ జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వి.శ్రీహరి కలిశారు. కూటమి అభ్యర్థిగా ఎంపికైనందుకు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా, అభ్యర్థుల గెలుపుపై చర్చించారు.

నేడు నూకాలమ్మ దేవర ఉత్సవం



భీమునిపట్నం, మార్చి 26: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి దేవర (చాటింపు) ఉత్సవం బుధవారం నిర్వహిస్తామని పూజారులు చౌదరి సత్యరాజు, వెంకటేష్, మారుతి తెలిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగను పురవీధుల్లో ఊరేగింపుగా సదురుపట్టు వద్దకు తీసుకువస్తామన్నారు. ఏప్రిల్ 7 నుంచి నాలుగు రోజులు ఉత్సవాలు జరుగుతాయన్నారు.

మేధోహక్కులపై గీతంలో కార్యశాల

సాగర్‌నగర్, మార్చి 26: మేధో పరమైన హక్కులపై గీతం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. గోవా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్‌బంకర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నూతన ఆవిష్కరణలను వాణిజ్య పరంగా ప్రయోజనకరంగా మార్చుకోవాలంటే మేధోహక్కులు పొందడం అవసరమని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

సింహాచలం, మార్చి 26: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం సాధ్యమని మిషన్ కర్షక దేవోభవ చైర్మన్, టీడీపీ నేత ఆడారి కిశోర్ అన్నారు. నృసింహవనంలో సేవ్ ప్రకృతి వ్యవసాయ రైతు సేవా సంస్థ ఆధ్వర్యంలో శబల భోజనాల పండుగలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రకృతి సాగుతో రైతాంగానికి సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి సాగు రైతు విజయ్‌రామ్ శిక్షణ ఇచ్చారు. ప్రకృతి సాగు, దేశవాళీ విత్తనాల వ్యాప్తి, మంచి ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. భారత్ కిసాన్ సంఘ్ కార్యదర్శి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'సాంకేతికతతో మెరుగైన జీవనం'

కొమ్మాది, మార్చి 26: ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ పనిని సులువుగా చేసేందుకు సాంకేతికత దోహదపడుతుందని ఫ్రింట్ త్రీడీ టెక్నాలజీ ఎండీ బీకేసీ గణేష్ అన్నారు. పి.ఎం.పాలెం బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో నిర్వహిస్తున్న టెక్ నెక్సస్ ఎక్స్‌ప్లోరింగ్ లాట్ అండ్ రోబోటిక్స్ వర్క్‌షాపులో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎస్‌సీ, మెకానికల్, ఈసీఈ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం దేశంలోనే తొలిసారి అన్నారు. ప్రతి విద్యార్థి నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ బి.సత్యనారాయణ, సీఎస్ఈ విభాగాధిపతి పద్మమోహన్, మెకానికల్ విభాగాధిపతి ఫాతిమా, ఈసీఈ విభాగాధిపతి బి.కిరణ్మయి పాల్గొన్నారు.

'వలంటీర్ల ద్రోహి జగన్ రెడ్డి'

ఎంవీపీ కాలనీ, మార్చి 26: పని వలంటీర్లది, పెత్తనం వైసీపీదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. ప్రణవ్ గోపాల్ విమర్శించారు. వలంటీర్ల ద్రోహి జగన్ మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. వారి జీవితాలతో వికృత క్రీడ ఆడుతున్నారని, వెట్టి చాకిరి చేయించుకుని సరిపడా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. జీతాలు పెంచమన్నందుకు దాడులకు పాల్పడ్డారని, ఎన్నికల్లో ప్రచారానికి రావాలని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఉసిగొల్పి, వాని జీవితాలతో ఆటలాడుతున్నారన్నారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తుండడంతో కేసుల్లో ఇరుక్కునేలా చేస్తున్నారని, వారికి భవిష్యత్తు ఇచ్చేది టీడీపీయేనన్నారు.

సినిమా గైడ్

● **ఓం భీం బుష్**: మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **భీమా**: రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **లైన్ మ్యాన్**: లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
● **యమధీర**: మౌర్య (గోపాలపట్నం)
● **గామి**: జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
● **ప్రేమలు**: శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 12, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 18, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబాటి 30, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 60, కీరదోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..

కన్నుల పండువగా పైడిమాంబ ఉత్సవం

» భారీగా తరలివచ్చిన భక్త జనం
» అమ్మవారికి ఎమ్మెల్యే వెలగపూడి పూజలు


ఆలయం వద్ద భక్తజన సందోహం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, మార్చి 26: పాతడెయిరీ ఫారం ఆదర్శ నగర్ జంక్షన్‌లోని పైడిమాంబ గ్రామ దేవత ముగింపు ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించి పూజలు చేయించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో కొద్దిసేపు తొక్కిసలాట చోటుచేసుకుంది. ద్వారకా సీఐ ప్రసాద్ నేతృత్వంతో సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో రవీంద్రనగర్ నుంచి అమ్మవారిని సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పరస జరిగింది. ఈ ఉత్సవంలో బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీముఖలింగం గ్రామ కళింగ సంఘానికి చెందిన అప్పారావు ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ చేశారు. మామిడి మోహన్ ప్రసాదాలు, కమలాలు అందించారు. ఉత్సవ నిర్వహణలో లోపాలపై పలువురు విమర్శించారు.

మరోసారి ప్రజా సేవకు అవకాశమివ్వండి

» భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


గంధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం(రూరల్), మార్చి 26: నిస్వార్థంగా సేవలందించేందుకు మూడోసారి ఎమ్మెల్యేగా గెలించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభ్యర్థించారు. మంగళవారం పాతకొవ్వాడ, కొత్తకొవ్వాడ, గంధవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని దేవాలయాలకు వెళ్లి పూజలు జరిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖపట్నం నుంచి గంధవరం గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిచేదని, ఈ సర్వీసు ఇటీవల నిలిపివేశారని దీనిని వెంటనే పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. దీనిపై ఆర్టీసీ అధికారులతో చర్చిస్తానని ముత్తంశెట్టి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, భీమిలీ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, సర్పంచ్ జీవీకే వర్మ, (మురళీరాజు), ఎంపీటీసీ సభ్యుడు రమణరాజు, నాయకులు బోని సన్యాసినాయుడు, గోవిందు, బుగత సత్యనారాయణ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలి: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో

భీమునిపట్నం, మార్చి 26: త్వరలో జరగనున్న ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 85 నుంచి 90 శాతం వరకూ పోలింగ్ నమోదయ్యేలా చూడాలని జిల్లా యంత్రాంగం నిర్దేశించినట్టు భీమిలి ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వీఏల్వోలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ, ఓటర్ టర్న్ అవుట్ పెరగాలంటే ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులను వీఎల్వోలు పంపిణీ బాధ్యతాయుతంగా జరగాలన్నారు. ఓటరుకు తన బూత్, తన ఓటరు నంబరు తెలపాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌లో తాగునీరు, వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు, టెంట్‌లు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఎన్నికల సిబ్బంది నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలన్నారు. రాజకీయ పక్షాలకు అనుకూలంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కొత్తగా వస్తున్న ఓటరు నమోదులో తప్పకుండా డోర్ వెరిఫికేషన్‌కు వెళ్లాలన్నారు. విశాఖ ఈస్ట్, నార్త్ నియోజకవర్గాలలో ఉన్న ఓటర్లు ఏవేవో కారణాలతో ఈ నియోజకవర్గంలో ఓటు నమోదుకు ప్రయత్నించే వీలుందన్నారు. అందువల్ల కుణ్ణంగా పరిశీలించాలన్నారు. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 74శాతం పోలింగ్ జరిగిందని, ఈసారి 85 శాతానికి పైగాపెరిగిగేలా సహకరించాలని కోరారు. వాలంటీర్లు, రేషన్ డీలర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో భీమిలి మండల తహసీల్దార్ గోవింద్, ఆనందపురం, పద్మనాభం తహసీల్దార్లు, జీవీఎంసీ భీమిలి జోన్ ఏసీపీ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ సంబంధాల ప్రాధాన్యం తెలుసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలో గీతం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

సాగర్‌నగర్, మార్చి 26: యువత సామాజిక సేవల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి అన్నారు. కంప్యూటర్‌సైన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో రుషికొండ, వాడపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాధ్యత మరవకూడదన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై వివరించారు. 100 మందికి పైగా కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మూడు రోజుల పాటు పాఠశాల విద్యార్థులతో గడిపి వారికి వివిధ పోటీలను నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటారు. బాలికలకు ఆరోగ్యపరమైన సూచనలందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.త్రినాథరావు, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వనిత, కె.యశోద, వి.సత్య అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

» తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


12వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, మార్చి 26: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. మంగళవారం 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వెలగపూడికి మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. వినాయకనగర్, బాలమురళీనగర్, పెదగదిలి శివాలయం వీధి, ఈశ్వరదేవీనగర్ కొండవాలు, సాలిపేట తదితర ప్రాంతాలలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సింహాచలం దేవస్థానం 275 సర్వే నంబరులో ఉంటున్న కుటుంబాలకు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే పట్టాలను అందిస్తామన్నారు. కొండవాలు ప్రాంతంలో పైలెట్‌వాటర్ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, ఒమ్మిపోలారావు, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవింద్, పోతిన భరత్, ముగడ రాజారావు, గెద్దవలస వెంకటరావు, దువ్వి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధిలో తెలుగుదేశం నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉషోదయ కూడలిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీగా శ్రీభరత్‌లను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి పోతన్నరెడ్డి, రాజు, చీనిపిల్లి నరేంద్ర, వాసు, శివ, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణి దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు


వన్యప్రాణి దినోత్సవం పోటీల విజేతలతో డీపీస్ ప్రతినిధులు

భీమునిపట్నం (రూరల్), మార్చి 26: మండలంలోని చిప్పాడ దివీస్ పరిపాలనా భవనంలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. తూడెం, అన్నవరం, నాగమయ్యపాలెం, చిప్పాడ తదితర గ్రామాలకు చెందిన 90మంది విద్యార్థులు పాల్గొన్నారు. వన్యప్రాణుల దినోత్సవం, నీటి ప్రాధాన్యంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతి పాఠశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ముఖ్య అతిథిగా దివీస్ జీఎం వై.ఎస్. కోటేశ్వరరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న వన్యప్రాణ జాతులను కాపాడవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మరో జనరల్ మేనేజరు ఎంఎస్‌రావు, ఇతర అధికారులు ప్రసాద్, డి. సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


భీమిలి కూడలిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తగరపువలస/ ఆనందపురం మార్చి 26: రానున్న ఎన్నికల దృష్ట్యా జాతీయ రహదారిపై వాహన తనిఖీకి ఎక్సైజ్‌శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ బృందాల ఆధ్వర్యంలో తగరపువలస, రాజాపులోవ, భీమిలి క్రాస్‌రోడ్స్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. విశాఖపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వి.సుబ్బారావు పర్యవేక్షణలో డాగ్ స్క్వాడ్, గంజాయి తనిఖీ విభాగాలను ఏర్పాటు చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వంటివి వాహనాల్లో రవాణాకు అడ్డుకట్టవేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. సీఐలు రాజుల నాయుడు, పి.చిన్నంనాయుడు, వేణుగోపాల్ ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు




తీవ్రంగా గాయపడిన వృద్ధుడు, ప్రమాదానికి కారణమైన కారు

ఆరిలోవ, మార్చి 26: ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికిగాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ అందించిన వివరాలివి.. హనుమంతవాక జంక్షన్ నుంచి సెంట్రల్ జైలు వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఇదే సమయంలో హనుమంతవాక వైపు వెళ్తున్న రెండుబైక్‌లను ఢీకొంది. వీఐపీ మార్గంలో ఈ కారును ఓ మహిళ నడుపుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే పరారయింది. తీవ్రంగా గాయపడిన వృద్ధునితోపాటు మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా సెంట్రల్ రోడ్డులో అతివేగంగా వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ఆనందగజపతిరాజుకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం, మార్చి 26: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి దివంగత పూసపాటి ఆనందగజపతిరాజుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఎనిమిదో వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఈఓ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చిత్రపటానికి ఆడిట్ అధికారి రాంబాబు తదితరులు పూల మాలలువేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆనందగజపతిరాజు పేదలకు విద్యాపరంగా చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షణాధికారి పి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో వస్త్ర సంచుల వెండింగ్ మెషీన్



వస్త్ర సంచులను చూపుతున్న ఏడీసీ సన్యాసిరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ, మార్చి 26: ఎంవీపీ రైతు బజారులో మంగళవారం ఆటో మెటిక్ వస్త్ర సంచుల వెండింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసి అదనపు కమిషనర్ సన్యాసిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చే ప్రక్రియలో భాగంగా జన కళ్యాణ సమాఖ్య మిత్సుబిషి ఎలివేటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా వస్త్ర సంచుల వెండింగ్ మెషీన్‌ను ఏర్పాటుచేశారు. పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటుచేసిన ఈ మెషీన్ సోలార్ పవర్‌తో పనిచేయడం ప్రత్యేకత కాగా రూ. పది నోటు లేదా కాయిన్, లేదా యూపీఐ పేమెంట్ ద్వారా రూ.10 చెల్లిస్తే ఆటో మేటిక్‌గా వస్త్ర సంచిని అందిస్తుంది. ఈ సంచి ఆరు కిలోల వరకూ బరువును తట్టుకుంటుందని, మెషీన్‌లో 500 సంచులు ఉంచవచ్చునని తెలిపారు.

వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణం

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

పెదవాల్తేరు, మార్చి 26: సచివాలయ వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణమని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లపై టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ఈ మేరకు మంగళవారం లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడమేంటన్నారు. కేవలం రూ.5 వేల వేతనంతో పని చేస్తున్నారన్నారు. సమావేశంలో ఐజీసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

ప్రధాన కాలువలో పూడికలు తొలగింపు

ఆరిలోవ, మార్చి 26: జీవీఎంసీ పదో వార్డు పాతడైరీ ఫారం సమీపంలో ప్రధాన కాలువలోని పూడికను అధికారులు తొలగించారు. ఈ కాలువ పూడికతో నిండిపోయి దుర్గంధభరితంగా మారడంతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు సిబ్బందితో పూడికను తొలగించి, శుభ్రపరిచారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

అలరించిన చిన్నారుల సంగీత విభావరి


సంగీత విభావరి నిర్వహిస్తున్న చిన్నారులు

సింహాచలం, మార్చి 26: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మంగళవారం పెందుర్తి ప్రాంతానికి చెందిన శ్రీవిభావరి సంగీత విద్యాలయానికి చెందిన చిన్నారులు దైవ భక్తిగీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 222 రోజులుగా నిత్య భజనల సంకీర్తనల యజ్ఞం కొనసాగుతోంది. ఇందులో భాగంగా పదేళ్లలోపు చిన్నారులంతా పలు సంకీర్తనలను సుమారు రెండుగంటల పాటు నిర్విరామంగా ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఆలయ అధికారులు చిన్నారులకు స్వామి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

యవన్ 2కె 24 పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కొమ్మాది, మార్చి 26: రాష్ట్రస్థాయిలో ఏప్రిల్ 5, 6 తేదీలలో యవన్ 2కే 24 పేరిట సదస్సు నిర్వహించనున్నట్టు ఆళ్వార్‌దాస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్ తెలిపారు. మంగళవారం పీఎం పాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈవెంట్‌లో రాష్ట్రంలోని 100 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. డిప్లమో, డిగ్రీ, ఫార్మసీ కళాశాలల నుంచి స్పోర్ట్స్, ఇంటలెక్చువల్ షోకేస్, కల్చరల్ కార్యక్రమాలకు సంబంధించి యవన్ 2కె 24.బ్లాగ్‌స్పాట్.కామ్ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని కరస్పాండెంట్ ఎస్.వి.ఎస్ రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో గెలుపొందిన వారికి రూ. 3లక్షల నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో మధుభట్, అకడమిక్ డైరెక్టర్ చందులాల్, ఏ.ఓ నాగేశ్వరరావు, సాంకేతిక ప్రిన్సిపాల్ అనిల్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.అచ్యుత్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.